
సాక్షి
కాకినాడ

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయం నిత్యాన్నదానానికి గుండుబోగుల వెంకటేశ్వరరావు, రామలక్ష్మి దంపతులు శనివారం రూ.20 వేలు విరాళం అందజేశారు.



కాలువలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 4900, మధ్య డెల్టాకు 2500, పశ్చిమ డెల్టాకు 7500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

రేపు జిల్లా స్పందన రద్దు

స్పందన

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. మండలం, సచివాలయం స్థాయిలలో యథాతథంగా జరుగుతాయన్నారు.

న్యూస్‌రీల్

స్కాలర్‌షిప్‌లకు కొత్త నిబంధనలు

కాకినాడ సిటీ: నేషనల్ పోస్ట్ మెరిట్ కం మీన్స్, ప్రీ మెట్రిక్, బేగం హజరత్ మహల్ స్కాలర్‌షిప్‌ల బయోమెట్రిక్ నమోదుకు ప్రస్తుత 2022-23 సంవత్సరానికి నూతన నిబంధనలు వెలువడ్డాయని జిల్లా మైనారిటీస్ అధికారి ఎం.సునీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కాలర్‌షిప్ కోసం హెడ్ ఇనిస్టిట్యూషన్ నోడల్ అధికారికి దరఖాస్తు చేసిన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు కావాలన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్లో ఆయా స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసిన విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు వారికి 2022-23 సంవత్సరంలో కేటాయించిన ఇనిస్టిట్యూట్ ఐడీ, పాస్‌వర్డ్ తీసుకుని కేటాయించిన సీఎస్‌సీ ఆధార్ సెంటర్‌లో ఈ నెల 10వ తేదీలోపు బయోమెట్రిక్ నమోదు కావాలన్నారు. అనంతరం నోడల్ అధికారులు విద్యార్థుల బయోమెట్రిక్ నమోదు చేయాలన్నారు. అనంతరం ఇనిస్టిట్యూట్ లాగిన్ అప్లికేషన్లు ఈనెల 20వ తేదీలోపు వెరిఫై చేసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా మైనారిటీ అధికారి ఎం.సునీల్ కుమార్ 98499 01141, జూనియర్ అసిస్టెంట్ ఆర్.శ్రీనివాస్ 93933 54575 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పీఆర్ డిగ్రీ కళాశాల అడ్మిషన్ల ప్రారంభం

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థుల చేరికలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు బీఏ, బీకామ్, బీఎస్సీ విభాగాల్లో 250 మంది చేరగా ఆదివారం యథావిధిగా ప్రవేశాలు ఉంటాయని, అన్ని సర్టిఫికెట్లు ఒరిజనల్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, తల్లి లేదా తండ్రి సంరక్షకులను తీసుకురావాలని ప్రిన్సిపాల్ తిరుపాణ్యం తెలిపారు.

ఎంపిక చేసిన లేఅవుట్లలో పనులు వేగవంతం : కలెక్టర్

కాకినాడ సిటీ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా సామూహిక గృహ ప్రవేశాలకు సంబంధించి ఎంపిక చేసిన లేఅవుట్‌లో మిగిలిన పనులన్నీ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జవహర్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి శనివారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐదు లక్షల గృహాలు నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ఒక్కో లే అవుట్ గృహ నిర్మాణాలు, అంతర్గత రహదారులు, మురికి కాలువలు ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. ఈనెల 20 నాటికి పనులన్నీ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. అర్హత ఉన్న కౌలు రైతులందరికీ రుణాలు మంజూరు చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో రీ ఓపెన్ అయ్యే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంతకుముందు సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ హౌసింగ్‌శాఖకు సంబంధించి లేఅవుట్ పనులు, గృహ నిర్మాణాలు, రీ సర్వే, జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి ప్రత్యేక శాశ్వత భవనాలు, జాతీయ ఉపాధి హామీ పథకం పనులు వంటి ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై సమీక్షించారు. జెడ్పీ సీఈవో ఎ రమణారెడ్డి, సీపీవో పి త్రినాథ్, డీపీవో ఆర్ విక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఎన్ విజయకుమార్, పశుసంవర్ధకశాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశరావు, హౌసింగ్ పీడీ బి సుధాకర్‌పట్నాయక్, ఏడీ సర్వే బి లక్ష్మీనారాయణ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శత్రువు ఒక్కడైనా ఎక్కువే.. స్నేహితులు వందమంది అయినా తక్కువే అంటారు వివేకానందుడు. మనిషిని అవసరంలో ఆదుకునే స్నేహ హస్తం కన్నా ప్రియమైనదేదీ లేదంటారు గురునానక్. నిజమైన మిత్రుడెవరో తెలిసేది కష్టకాలంలోనే అంటారు గాంధీజీ.. ఎవరేమన్నప్పటికీ స్నేహాన్ని మించింది ఈ లోకాన లేదంటారు సినీ కవులు.. **ఇంతటి** విశిష్ట బంధాన్ని పటిష్టం చేయ**దానికి ఇప్పటి** ఆధునిక కమ్యూనికేషన్ తోడ్పా**టునందిస్తోం**ది. చిన్నప్పుడెప్పుడో మరిచిపో**యిన** మిత్రుడ్ని గుర్తు చేస్తోంది. తన**తో చదు**వుకున్న వారందరినీ ఏకం చేస్తో**ంది.. సోషల్** మీడియా వేదికగా చాలామంది **స్నేహితుల**వుతున్నారు. పుట్టిన రోజు వస్తే **ఒకప్పుడు** ఇంట్లోవారికి తప్ప మరెవరికీ **తెలిసేది కాదు.** అలాంటిది ఇప్పుడు ఫేస్‌బుక్.. **వాట్సప్‌లు** వచ్చాక ఇలాంటి సందర్భాల్లో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరికైనా సహాయం అందించడంలోనూ ఈ మిత్ర సమూహాలు ముందుంటున్నాయి. కొన్నాళ్లుగా టెన్తులోనో.. లేదా మరే సందర్భంలోనో కలిసి చదువుకున్న వారంతా ఏటా ఒకసారైనా కలిసి ఆనందం కలబోసుకుంటున్నారు. వీరి స్నేహ కలయికకు ఆధునిక సమాచారమే వారధిగా నిలుస్తోంది.

● అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం





నేస్తమా.. సేవా హస్తమా..

● సేవా దృక్పథాన్ని చాటుకుంటున్న మిత్ర సమూహాలు ● సోషల్ మీడియా వేదికగా ఒక్కటవుతున్న స్నేహితులు

స్నేహానికి సై

ప్రత్తిపాడు: వారు చిన్ననాటి స్నేహితులు. వారు వృత్తి రీత్యా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. 35 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. వారిలో ఒకరు తెలంగాణ గవర్నర్ తమిళిసై కాగా మరొకరు ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని దేవన్ రేమల. వారిద్దరూ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఒకే ప్రాంతంలో ఉండేవారు. తమ స్నేహం గురించి రేమల ఏమంటారంటే... ప్రస్తుతం గవర్నర్ తమిళిసై తండ్రి కుమారి అనంతన్, మా నాన్న దేవరాజ్ రాజకీయంగా సన్నిహితులు. **తమిళిసైతో కలిసి రాయపురంలో ఒకటో తరగతి నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకూ** చదువుకున్నాను. తమిళిసై మెడిసిన్ చదివారు. నేను ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డాను. ఆమె గవర్నరుగా బాధ్యతలు చేపట్టారని తెలిసి చాలా సంతోషించాను. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ గవర్నర్‌కు మెయిల్ పంపాను. దీంతో ఆమె స్పందించారు. ఫలితంగా తమిళ సైను కలిసే అవకాశం ఇటీవల వచ్చింది. చూడగానే గవర్నర్ ఆప్యాయంగా పలకరించారు. ఆనాటి ముచ్చట్లను జ్ఞప్తికి తెచ్చుకున్నామని రేమల అన్నారు. అంతస్తులు, హోదాలు తమ స్నేహానికి అడ్డు కాలేదన్నారు.



చిన్ననాటి మిత్రురాలైన తెలంగాణ గవర్నర్ తమిళసైని శాలువాతో సత్కరిస్తున్న ఉపాధ్యాయిని దేవన్ రేమల

ఆపదలో అండగా నిలిచి..

గోపాలపురం: ఇబ్బందుల్లో ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981–82లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు. వీరంతా పెద్ద మనసుతో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అప్పట్లో వీరితో చదువుకున్న సుమారు వంద మంది పూర్వ విద్యార్థుల ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్నారు. తోటి మిత్రులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు. సుమారు రూ.2 లక్షల ఆర్థిక నిధి ద్వారా పేద విద్యార్థులకు జీవనోపాధిని కల్పిస్తున్నారు. విద్యార్థులకు సంబంధించి ఎవరైనా చనిపోతే బాధిత కుటుంబానికి రూ. 25 వేల తక్షణ ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అట్టడుగు వర్గాల స్నేహితులకు వివిధ రంగాల్లో ఉపాధి కల్పిస్తున్నారు. ఇందుకు అవసరాన్ని బట్టీ సాయం చేస్తున్నారు. తనతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించడం వల్ల సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని వైష్ణవు శ్రీనివాస రావు చెప్పారు.



మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఔదార్యం... అ'పూర్వ'ం

మండపేట: ఆపన్నులకు ఆసరాగా నిలుస్తున్నారు మండపేట ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సేవా సంస్థ సభ్యులు. ఏటా రూ. 7.5 లక్షల నుంచి రూ. 8 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 75 మంది 2008లో ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ పేరిట సంస్థగా ఏర్పడ్డారు. కొంత స్థిర నిధిని ఏర్పాటు చేసుకున్నారు. కోవిడ్ ముందు వరకు 13 ఏళ్ల పాటు ఏటా ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు రూ. 2.5 లక్షల విలువైన పుస్తకాలు, స్టేషనరీని అందించేవారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ప్రభుత్వమే విద్యార్థులకు పుస్తకాలను అందిస్తుండటంతో మూడేళ్లుగా ప్రభుత్వ, మున్సిపల్ హైస్కూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. కలువపువ్వు సెంటర్‌లో ఏటా శ్రీరామ నవమి నుంచి జూన్ మొదటి వారం వరకు చల్లటి మజ్జిగను సరఫరా చేస్తున్నారు. ఇందుకు ఏటా రూ.4 లక్షలు వెచ్చిస్తున్నారు. సంస్థ కార్యదర్శి సంకా శ్రీనివాసరంగా ఏటా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి రూ. 1.5 లక్షల విలువైన బహుమతులు అందజేస్తున్నారు. ప్రస్తుతం బిక్కిన చక్రవర్తి అధ్యక్షునిగా ఉండగా కోశాధికారిగా పోతంశెట్టి సత్తిబాబు సేవలు అందిస్తున్నారు.



సైకియాట్రిస్ట్ డాక్టర్ రామారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న సభ్యులు (ఫైల్)

వారిది 'వజ్ర' సంకల్పం



డైమండ్ గ్రూప్ సభ్యులు

తాళ్లరేవు: తాళ్లరేవు శ్రీమతి నామన వెంకాయమ్మ జెడ్పీ హైస్కూల్‌లో 1987–88లో చదివిన టెన్త్ విద్యార్థులు డైమండ్ గ్రూప్‌గా ఏర్పడి పలు సేవలందిస్తున్నారు. తమతో చదువుకుని ఆర్థికంగా వెనుకబడిన సహచరులకు చేయూత అందిస్తున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో రూ.1.35 లక్షలతో స్టేజ్ నిర్మించారు. ఒక మిత్రుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో రూ.1.25 లక్షల ఆర్థిక సాయమందించారు. మరో మిత్రుడు సత్యానందం కుమార్తెల పేరున రూ.లక్ష డిపాజిట్ చేశారు. మిత్రుడు విజయ్ కుమార్ ఇంటి నిర్మాణానికి రూ.76 వేలు అందించారు. అనారోగ్యంలో ఉన్న వెంటపల్లి నూకరాజుకు రూ.50 వేలు.. ఇలా తోటి స్నేహితులకు ఏ కష్టం వచ్చినా మేమున్నామంటూ శ్రీనివాసరెడ్డి, గంజా సూరిబాబు, పొన్నాడ పేరయ్య రాజు తదితరులు బాసటగా నిలుస్తూ స్నేహ బంధాన్ని చాటుకుంటున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు సంక్షేమ బాట

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కాకినాడలో అంబేడ్కర్ విశ్రాంత మందిరం, కాంస్య విగ్రహం ప్రారంభోత్సవం

కాకినాడ రూరల్: బాబా సాహెబ్ అంబేడ్కర్ అంటే అందరికీ స్ఫూర్తి అని ఎంపీ వంగా గీత, మాజీ మంత్రి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ 48వ డివిజన్ ఎస్.అచ్చుతాపురంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సహకారంతో నిర్మించిన అంబేడ్కర్ విశ్రాంత మందిరం, అంబేడ్కర్ కాంస్య విగ్రహాలను శనివారం వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ అంబేడ్కర్ భారతీయుడు కావడం గర్వకారణమన్నారు. సమాజంలో విద్య అసమానతలను తొలగిస్తుందని, గౌరవాన్ని ఇస్తుందని, ప్రతిభావంతులను చేస్తుందని, మనిషి అన్ని రకాలుగా ఎదగానికి చేస్తుందని అంబేడ్కర్ నమ్మడంతోనే నేటి యువతకు అన్ని సౌకర్యాలు కలుగుతున్నాయన్నారు. ఆయన ఆశయ సాధనకు ముఖ్యమంత్రి జగన్ పలు సంక్షేమ పథకాలు తీసుకువచ్చారన్నారు. మాజీ మంత్రి కన్నబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వేచ్ఛా వాయువులు పీల్చుతూ సమానత కోసం తపిస్తూ జీవించగలుగుతున్నామంటే అంబేడ్కరే కారణమన్నారు. ఆయన రాసిన రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తిమంతంగా నిలిచిందన్నారు. అంబేడ్కర్‌ను భావి తరాలకు సంపదగా అప్పగించడం మన బాధ్యత అన్నారు. నీకోసమే జీవిస్తే నీలోనే జీవిస్తావు.. జనం కోసం జీవిస్తే చిరస్మరణీయంగా జనం మధ్య మిగిలిపోతావని అంబేడ్కర్ అన్న మాటలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అంబేడ్కర్ విశ్రాంతి మందిరం నిర్మాణం తనకు చాలా సంతృప్తిని కలిగించిందన్నారు. కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, ఏడీసీ నాగనరసింహారావు, ఎమ్మెల్సీ అభ్యర్థిని కర్రి పద్మశ్రీ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు నారాయణరావు, బాబూరావు, పెదపాటి నాగబాబు, చిల్లి దేవరాజు, సమనాసి ప్రసాద్, కేబుల్ రమణ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ చేసి నివాళులర్పిస్తున్న కన్నబాబు, ఎంపీ వంగా గీత

మంత్రి రాజాకు ప్రముఖుల పరామర్శ

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను పలువురు ప్రముఖులు పరామర్శించారు. శనివారం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు భారీగా తరలివచ్చారు. శుక్రవారం మంత్రి మాతృమూర్తి సత్యనారాయణమ్మ గుండె పోటుతో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ప్రత్తిపాడు, పాయకరావుపేట ఎమ్మెల్యేలు పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎమ్మెల్యేలు వరుపుల సుబ్బారావు, రాజా అశోక్‌బాబులు మంత్రి రాజాను, సత్యనారాయణమ్మ భర్త శంకర్రావును పరామర్శించారు. సత్యనారాయణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డాక్టర్స్ అసోసియేషన్, బార్ అసోసియేషన్, పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి రాజాకు ధైర్యం చెప్పారు. సత్యనారాయణమ్మ ఆత్మకు శాంతి కలగాలని పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రార్థనలు చేశారు. ఆదివారం తుని నియోజకవర్గ పరిధిలోని అన్ని చర్చిల్లో మంత్రి రాజా కుటుంబానికి స్వస్థత చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేయాలని నిర్ణయించారు. తుని చాంబర్ ఆఫ్ కామర్స్ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో అన్నిరకాల వ్యాపార, ప్రైవేట్ విద్యాసంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, తుని ఎంపీపీ బొప్పన రాము, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్,శ్రీహరి రాజు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



సత్యనారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ఇక కాకినాడ రైల్వే స్టేషన్ కేక

- ప్రపంచ శ్రేణి సౌకర్యాల కల్పనకు చర్యలు
- రూ.21 కోట్లతో ఆధునీకరణకు ప్రతిపాదనలు
- నేడు ప్రధానితో వర్చువల్‌గా శ్రీకారం

కాకినాడ: కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టారు. అమృత్‌భారత్ పథకంలో భాగంగా తొలివిడత అభివృద్ధి చేసే రైల్వేస్టేషన్ల జాబితాలో స్థానం సంపాదించిన ఈస్టేషన్‌కు అత్యాధునిక హంగులు సమకూరబోతున్నాయి. ప్రపంచ శ్రేణి సౌకర్యాల కల్పన ద్వారా రూపురేఖలను మార్పు చేయనున్నారు. 1896లో నిర్మాణమైన కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్ ఇప్పుడు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోబోతుంది. రూ.21 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు సంబంధించి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ఆదివారం శ్రీకారం చుట్టనున్నారు.

తొలివిడతలో చోటు

అమృత్‌భారత్ పథకంలో తొలివిడత అభివృద్ధికి కాకినాడ, తుని రైల్వే స్టేషన్లు ఎంపికయ్యాయి. ప్రజాప్రతినిధులు, ప్రజలు, ప్రయాణికుల సంఘాలను పరిగణనలోకి తీసుకుని వారిచ్చిన సూచనలు, సలహాలు ఆధారంగా కాకినాడ స్టేషన్‌లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలనే అంశంపై ప్రతిపాదనలను ఇప్పటికే సిద్ధం చేశారు. ఎంపీ వంగా గీత రైల్వేస్టేషన్ అభివృద్ధికి సంబంధించి అనేక సూచనలు, ప్రతిపాదనలను ఇప్పటికే రైల్వే మంత్రితోపాటు రైల్వే బోర్డు ముందు ఉంచారు.

పలు వసతుల కల్పన

స్టేషన్ ప్రధాన రైలుమార్గంలో లేకపోయినా రోజూ సుమారు 4వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రెండు ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారం విస్తరణ, రైళ్లు, బోగీల నెంబర్లు తెలిసేలా డిజిటల్‌బోర్డులు, ఫుడ్‌కోర్టుల ప్రతిపాదన, ఏటీఎం సదుపాయం, విద్యుదీకరణ, చక్కని గ్రీనరీ, ఎలివేషన్ నిర్మాణం, టాయ్‌లెట్లతోపాటు ప్రయాణికులతో వేచి ఉండే గదుల ఆధునీకరణకు సంబంధించి ప్రతిపాదిస్తున్నారు. ఇందుకోసం రూ.21 కోట్లు ఖర్చు కాగలదని ప్రాథమికంగా అంచనా.

రైల్వే స్టేషన్ల ఆధునీకరణ ప్రక్రియకు ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం వర్చువల్‌గా శ్రీకారం చుడతారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇక్కడ కూడా ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు.



కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్

రైల్వేశాఖ సానుకూల స్పందన



'అమృత్‌భారత్' పథకంలో కాకినాడ రైల్వేస్టేషన్‌కు స్థానం దక్కడం సంతోషదాయకం. ఇందుకు సహకరించిన రైల్వే మంత్రి, ఉన్నతాధికారులకు ధన్యవాదాలు, కాకినాడ టౌన్‌స్టేషన్‌లో మరిన్ని అత్యాధునిక సౌకర్యాలు, వసతులు కల్పించేందుకు ఇప్పటికే కేంద్ర రైల్వే శాఖకు ప్రతిపాదనలు కూడా అందించాం. రైల్వేశాఖ నుంచి సానుకూలస్పందన కనిపిస్తోంది.

– వంగా గీత, ఎంపీ

నేటి నుంచి ధర్మ ప్రచార మాసోత్సవాలు

- నెల రోజులు ప్రచార కార్యక్రమాలు
- రత్నగిరిపై ప్రారంభించనున్న దేవదాయశాఖ మంత్రి సత్యనారాయణ

అన్నవరం: హిందూ ధర్మం గొప్పతనాన్ని వివరించేందుకు 'ధర్మ ప్రచార మాసోత్సవాలను' అధిక శ్రావణ శుద్ధ పంచమి, ఆదివారం ఉదయం 9.39 గంటలకు అన్నవరంలోని రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ప్రారంభిస్తున్నారు. నెల రోజుల పాటు జరుగనున్న ఉత్సవాలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ శ్రీకారం చుడతారు. కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొంటారని అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ శనివారం వివరించారు. రాష్ట్ర ప్రజల సర్వతోముఖాభివృద్ధికి, వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ స్వామివారి దేవస్థానం సహస్ర దీపాలంకార సేవ మందిరంలో ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు సత్యదేవుని వ్రతమాచరిస్తారు. అనంతరం వినాయక అతిథి గృహం నుంచి మంత్రి దంపతులతో పాటు, ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత తదితరులు భారీ ఊరేగింపుగా సత్యదేవుని ఆలయానికి చేరుకుని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం క్షేత్రపాలకులు సీతారాములకు కూడా పట్టువస్త్రాలు సమర్పిస్తారని ఈఓ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సత్యదేవుని ప్రచార రథాన్ని జెండా ఊపి ధర్మ ప్రచారం ప్రారంభిస్తారు. వందలాది జానపద కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకోనున్నాయి. తరువాత రామాలయం వద్ద విశ్రాంత మండపంలో జరిగే ధర్మ ప్రచార సభలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే ప్రసంగిస్తారు. అనంతరం దేవస్థానం నిర్మాణాలపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.



ప్రచారానికి సిద్ధమైన సత్యదేవుని రథం

అడ్డతీగలలో సామూహిక వ్రతాలు

ధర్మ ప్రచార మాసోత్సవాలలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం సత్యదేవుని సామూహిక వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. అనంతరం సత్యదేవుని రథం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాల్లో ధర్మప్రచారం నిర్వహించనున్నారు.